తారాగణం

కాంతారావు
బాలయ్య
రేలంగి
పద్మశ్రీ నాగయ్య
లింగమూర్తి
బాలకృష్ణ
రామదాసు
వేళంగి


కాంచన
వాసంతి
వాణిశ్రీ
జి. వరలక్ష్మి
జ్యోతి
ఉదయచంద్రిక
విజయలలిత
లక్ష్మీకాంతమ్మ

&

టి. గోపాలకృష్ణ

— వాణీ ఫిలిం డిస్ట్రిబ్యూటర్స్

'స్వతంత్ర' విజయవాడ - 4.



విజయసారథి ప్రొడక్షన్స్

"వీర పూజ"

కథా సంగ్రహం

విజయంతో సింహపురి వీరులు స్వదేశానికి తిరిగి వస్తున్నారు. వారికి నాయకత్వం వహించినవారు యువరాజు అమరసింహుడు అతని సోదరుడు సమరసింహుడు.

జయజయ ధ్వానాలతో ప్రజావాహిని వారికి సుస్వాగతం పలికింది. ఊరు ఊరునా వీధి వీధినా అమరసింహుని పేరు మారుమోగింది. తన యందు ప్రజలు ప్రదర్శిస్తున్న అఖండ గౌరవానికి ఆనందంతో పొంగి పోయాడు అమర్ ! కానీ సమరుని హృదయంలో అసూయ ప్రవేశించింది.

నిండు కొలువులో తండ్రిగారైన రాజసింహమహారాజు కూడా అమరునికే వీరపూజ జరిపించడం సమరుడు సహించలేకపోయాడు.

నిప్పులు కురిపిస్తూ తల్లి భవానీ వద్దకువచ్చి తన హృదయంలోని బాధను వెల్లడించాడు. ఆవేశపరుడైన సమరుని మనస్సు చక్కగా అర్థం చేసుకొన్న భవాని, 'నీ అన్నగారిని గౌరవించితే నిన్ను గౌరవించినట్లు కాదా' అంటూ హితవు చెప్పింది. సవతి పుత్రుడైన అమరుని పట్ల తన తల్లి పక్షపాతం చూపుతున్నట్లు భావించిన సమరునికి ఆమె మంచి మాటలు రుచించలేదు. ఏమైనాసరే తాను రాజు కావలసిందేనని నిశ్చయించు కొన్నాడు.

అమరునికి పట్టాభిషేకం జరిపించటానికై రాజసింహుడు మంత్రి వినయసాగరునితో సమాలోచన జరుపుతుండగా సమరుడు విరుచుకుపడ్డాడు. తనకు రావలసిన అర్ధరాజ్యం వెంటనే పంచి ఇవ్వమన్నాడు. ఆగ్రహించిన మహారాజును అమరుడు సమాధాన పరచి, సమరునికే పట్టాభిషేకం చేయవలసిందిగా కోరాడు. కానీ దానంగా యిస్తే పుచ్చుకునే దౌర్భాగ్యం తనకు పట్టలేదనీ, సమరంలోనే ఈ సమరుడు కలుసుకో గలడనీ పలికి రాజ్యం విడిచి వెళ్ళిపోయాడు.

ఇంతలో మరియొక కొత్తసమస్య తలఎత్తింది. శత్రురాజైన నాగకేతు, తనసోదరిని అమరునకిచ్చి వివాహం జరిపించ వలసిందిగా కోరుతూ రాయబారం పంపాడు. అమరుని మనస్సు ఇదివరకే మంత్రి కుమార్తె కల్యాణికి అంకితమైంది. కానీ తండ్రి మాటకు తల ఒగ్గి దేశం కోసం ప్రజల క్షేమం కోసం తన ప్రేమను త్యాగం చేయడానికి సిద్ధమైనాడు.

అమరుని నిర్ణయం మహామంత్రి ఆశలకు గొడ్డలి పెట్టయింది. తన కుమార్తెను మహారాణిని చేయాలని అతని సంకల్పం. అందుకోసం సమరునితో చేయికలిపాడు. సమరుణ్ణి పురికొల్పి హఠాత్తుగా రాజ్యంపై దండెత్తచేశాడు.

రక్తపాతాన్ని అరికట్టడానికై అమరుడు సమరునితో ద్వంద్వ యుద్ధానికి పూనుకొన్నాడు. అన్నదమ్ములమధ్య చెలరేగిన ఈ విపరీత పరిస్థితిఎటు దారితీస్తుందోనని రాజమాత తల్లడిల్లిపోయింది. తన కంఠంలో ప్రాణం ఉండగా తమ్మునికి ఏ ఆపదా రానివ్వనని అమరుడు తల్లికిచ్చిన మాట నిలబెట్టి, ద్వంద్వయుద్ధంలో తానే ఓడినట్లు నటించి సమరుణ్ణే రాజుగా ప్రకటించి యుద్ధభూమిని వీడి వెళ్ళిపోయాడు.

జ్ఞానేంద్రుడనే యోగి అమరునికి ఆతిథ్యమిచ్చాడు.

సమరుణ్ణి వివాహం చేసుకోడానికి నిరాకరించిన కల్యాణి మనస్సు మార్చడం మహామంత్రి తరం కాలేదు. అమరుడు బ్రతికి ఉండగా తన

ఆశయం నెరవేరదని భావించి, రహస్యంగా అతన్ని కడతేర్చమని హంతకులను పంపాడు। హత్య జరిగిపోయింది.

ప్రతాప్ అనే కర్షకనాయకుడు హంతకులనుబంధించి మహామంత్రి సమక్షానికి తెచ్చాడు. ప్రతిఫలంగా ప్రతాప్‌నే బంధించమని ఆజ్ఞాపించాడు మహామంత్రి। తప్పించుకొని పారిపోయాడు ప్రతాప్।

హత్య గావించబడ్డ అమరుణ్ణి జ్ఞానేంద్రుడు బ్రతికించాడు. తన శక్తులన్నిటినీ అతనికి ప్రసాదించి 'ధర్మదాసు' అనేపేరుతో లోకానికి సేవచేయమని ఆదేశించాడు. తాను జీవసమాధిలో ప్రవేశించబోతున్నానని, కాంచనగిరి శృంగంమీదఉన్న కపిలగోవు క్షీరాన్నితెచ్చి తన సమాధిపై ప్రోక్షించి తనకు శాశ్వతముక్తి లభింపచేయవలసిందనీ కోరాడు.

అమరునితో తన సోదరి వివాహం తప్పిపోయినందుకు నాగకేతు మండిపడ్డాడు. పగ సాధించటానికి పూనుకొన్నాడు.

పారిపోయిన ప్రతాప్‌ను బంధించడానికి సమరుడే స్వయంగా బయలుదేరాడు. దారిలో ప్రతాప్‌సోదరి సుమతి అతనికంట బడింది. ఎంత ప్రయత్నించినా తన శీలాన్ని కాపాడుకోలేక పోయింది. నదిలో దూకుతుంది ఆత్మహత్య చేసుకోవాలని।

ప్రతాప్‌ను సిపాయిలు బంధించారు. సమరుని పాలనలో అవినీతి చెలరేగి పోతున్నది. ఆ సమయంలో ధర్మదాసు ప్రజలకు అండగా నిలిచాడు. గ్రామంలోని పూలపిల్ల కనకం, ఆమె మామ శతభిషం, గాజులవ్యాపారి ఆడంబరం, నగరులోఉన్న ఉభయకుశలోపరి ధర్మదాసుకు రాజ్యాంగ రహస్యాలు తెలియ జేస్తున్నారు।

ప్రతాప్‌ను విడిపించడానికీ, సుమతికి జరిగిన అన్యాయానికి ప్రతీకారంగా సమరునికి గుణపాఠం నేర్పడానికి ధర్మదాసు నిశ్చయించుకొన్నాడు. ఉభయకుశలోపరి సాయంతో సమరుణ్ణి కన్నెదీవికి పిలిపించాడు.

కన్నెదీవిలో ఏం జరిగింది ?

ప్రతాప్ ఎలా విడుదలయ్యాడు ?

పగబూనిన నాగకేతు ఏమయ్యాడు ?

జ్ఞానేంద్రుని ఆశయం ఎలా నెరవేరింది ?

వీరపూజకు తానే అర్హుడని అమరుడు ఎలా నిరూపించుకొన్నాడు ?

సమాధానం తెరమీద చూడండి !

పాటలు

పాట నెం. 1

రచన : వీటూరి　　　పాడినవారు : సుశీల, ఘంటసాల.

కొనుమా సరాగమాల
నిలిచేను నీదు మ్రోల
కుసుమించు నీదు నయనాలు
రస రాజ్యాల జేర్చు ద్వారాలు
మదిలో విరాళి, నీకే నివాళి
మాయని తీయని జ్వాల !
వరమైన నీదు చరణాలు
నను పాలించు కోటి దైవాలు
సరసార డోల విరహాల జోల
సాగిన చల్లనివేళ ! ....

పాట నెం. 2

రచన : వీటూరి　　　పాడినవారు : యల్. ఆర్. ఈశ్వరి, ఘంటసాల.

ఆడంబరం : రింగు బటాణీ చెయ్యవె బోణీ
కొత్తరకం సరకు, రాలేదు ఇంతవరకు,
ఈ సరుకులోని తళుకుచూడి ఓ పిల్లా !

కనకం : పైన పటారం లోన లొటారం
నీ మాటలన్ని కల్ల – ఈ గాజులన్ని గుల్ల,
ఈ సరుకు తళుకు తెలుసులేవోయ్ ఓ అబ్బీ !

ఆడంబరం : చెప్పన్న దేశాలు ఎన్నెన్నో చూశా
గొప్ప గొప్ప ఆడోళ్ళకు ఎందరికో వేశా

కనకం : చాలుచాలు ఈ కోతలు సవాలక్ష విన్నా
సంబరపడి వేసుకుంటే సగంలోనె సున్నా –
ఆగవోయ్ అబ్బీ ఆగు....

ఆడంబరం : కాంతలకీ తెలియుటకై గాజులుండాలి,
అలా ఘల్లుమంటే పడుచుగుండె ఝల్లుమనాలి

కనకం : జాతికి మగవారైనా మూతికి మీసాలున్నా
నీతిలేని మగ కాంతలు వున్నారోయ్ మీలోనా
వెయ్యవోయ్ వారికే వేయ్ !

ఆడంబరం : అందమైన నీ చేతులు కందకుండ వేస్తా
కాదంటే నీకాడే ఉరిపోసుకు చస్తా

కనకం : అలాగైతే వెయ్యవోయ్ ఈసారికి చూస్తా
నా మనసుకు నచ్చితేను మళ్ళీమళ్ళీ రప్పిస్తా

ఆడంబరం : అబ్బొ ఆబ్బొ.

కనకం : ఏమి వయారం – దించుమల్లారం

పాట నెం. 3

రచన : దాశరథి　　　పాడినవారు : పి. లీల

కనులనిండా మధువునింపి
పెదవి కందిస్తానోయ్ –
వలపు చిందిస్తానోయ్ !
స్వర్గమెచటో ఉన్నదంటే
నమ్మవలదోయ్,
కనులముందే కలదు స్వర్గ
అనుభవించాలోయ్ –
ఇంద్రుడైనా చంద్రుడైనా
నీవేలేవోయ్
రంభనైనా, ఊర్వశైనా
నేనెలేవోయ్
కొప్పులోని పారిజాతం
గుప్పుమంటుంటే
చెప్పలేని కోరికేదో
గప్పుమంటుందీ !

పాట నెం. 4

రచన : కొసరాజు పాడినది : ఎస్. జానకి

పులకరించెనే మేను పులకరించెనే
పచ్చ పచ్చని పైరచేలు – పిలిచి పలకరిస్తుంటే
సైగ జేసి చల్లగాలి సరసానికి దిగుతుంటే
గుసగుస లాడుతు వుంటే
ఎవరోయని వెనకజూడ ఎగతాళగుచున్నది ! ॥ఏమిటి॥
కదలి పోవు నీలి మబ్బు లెదురుగ కవ్విస్తుంటే
కనులు కలిపేస్తుంటే
ముచ్చటైన ఊహలేవొ ముంచుక వస్తున్నవీ ! ॥ఎందుకో॥
చిలిపిగ సెలయేటి కన్నె చెక్కిలి కొడుతూవుంటే
చిరు జల్లులు విసురుతుంటే
చెప్పరాని సిగ్గేదో చేయి గలుపుతున్నదీ .... ॥ఎందుకో॥

పాట నెం. 5

రచన : వీటూరి పాడినవారు : సుశీల.

ప్రియమైన ప్రేమ పూజారీ !
పెను చీకటైన – నా ఆలయాన వెలిగించు – వలపుజ్యోతి ॥ప్రియ॥
మనసులో నీవు ! మమత నింపేవు – నాలోనే నిలిచేవు .... !
వయసు పూయించి ! వలపు పండించి – రాగాలే చిలికేవు.... !
నా జీవితాన – పన్నీటివాన కురిసె ఈరోజున ॥ప్రియ॥
కనులలో రాలు : కలికి ముత్యాలు – పాదాలా పోసేను :
కన్నె అందాలు : తెగని బంధాలు ! హారాలే వేసేను !
ఫలియించెనోయి ! ఈనాటికైన చెలియ ఆరాధన .... ॥ప్రియ॥

పాట నెం. 6

రచన : ఆరుద్ర పాడినవారు : ఘంటసాల

అద్దరిని వున్నాడు అందగాడు, ఓ
ముద్దరాల నిన్నేమో రమ్మన్నాడు – నీ
అద్దమంటి చెక్కిళ్ళు చెమరిస్తాడు ....

లేత లేత సొగసులు; లేనిపోని సిగ్గులు
చినవాడు చెయ్యేస్తే విరిసే మొగ్గలు
మేను పులకరించ విరితేనె చిలకరించ
మిస మిసలా పరువాలు ఉసిగొలిపేవాడు ....
మసక చీకటిలో, మల్లె పందిరిలో
కొసరే అందాలు కొల్లగొట్టువాడు
కైపులోన ముంచి మైమరపులోనె ఉంచి
కవ్వించి నవ్వించి కరగించేవాడు ॥

పాట నెం. 7

రచన : దాశరధి పాడినది : సుశీల

నీవే నీవే కావాలి
నేడే నాతో రావాలి
నీ ముందే నేనున్నాను
నీ వెనకే నే నడిచేను
గిరిలో వనిలో కలలో నీలో
నే నే నిండినాను –
వలపుల దీపం వెలగాలి
ఇలలో చీకటి తొలగాలి
తీరక మిగిలిన కోరికలన్నీ
తీరాలోయి నేడే
నీకే అంకితమైనాను
నిన్నే మదిలో నిలిపాను
నీవే నేనని నేనే నీవని
ఎంతో నమ్మినాను....

పాట నెం. 8

రచన : కొసరాజు పాడినది : సుశీల, ఘంటసాల, కోరస్.

ఊరుపేరు చెప్పమంటావా ? మీసాలరాజా
ఉన్నచోటు తెలుసుకుంటావా !

ఈపూటకు ఈవూరు, రేపటి కింకేవూరో.
పుట్టలమ్మ చెరువుకాడ గుట్ట ఒకటిఉన్నాది.
గుట్టచాటుగా పోతే పుట్టఒకటి ఉన్నాదీ
పుట్టలోని నాగుబాము బుసలుగొడుతు ఉన్నాదీ
పడిగెమీద కొట్టిపోతె బాట సూటిగుంటాదీ!
ఒకచోటే కాలునిలిపి ఉండలేము బాబయ్యో:
ఒక ఊళ్ళో పక్క పరశి పండలేము ఓబయ్యో!
దేశ దిరుగు దోళ్ళమయ్యా విద్దె లెరిగి నోళ్ళమయ్యా
సూడాలని బుద్దివుంటే సూపుతాము రావయ్యో!
గుంపులోని శినోడు కురచ మీసమునోడు
చెట్టు దొక్కినాదేమొ తప్పుకొని వచ్చాడు.
ఎక్కడైనా తగిలాడా యీ సాయల ఉన్నాడా
సూశుంటే చెప్పవయ్యా శిటికెలోన పోతమయ్యా

పాట నెం. 9

రచన : సముద్రాల   పాడినవారు : ఘంటసాల.

కానరావయ్య కావరావయ్య
గౌరీశ కైలాసవాస
శివ శీతాంశురేఖా వతంసా!
పరమ కారుణ్యభావా – మహాదేవగతి నీవెకావా –
సుజన మందార భుజగ మంజీర త్రిపుర సంహార శంభో. ॥కాన॥
మాట నిలబెట్టకున్నా– ముని వాంఛ నెరవేరదన్నా
భసిత గౌరాంగ కలిత సారంగ విజిత మాతంగలింగా ॥కాన॥
సురధేనువు కరుణించని నీ వరము పరిపూర్ణము కాదయ్యా!
గురుదేవుని కోరిక చెల్లించని నా శ్రమ వ్యర్థమేనయ్యా!
పరిశోధన మానవయ్యా పాలకు వెలగా ప్రాణము లివిగో
కొనవయ్యా
ఈశా మహేశా – కరుణాలవాల కామేశా....

సాంకేతిక నిపుణులు

కథ :	టి. జి. కె.
మాటలు :	వీటూరి
కెమెరా :	జె. సత్యనారాయణ
కళ :	కె. ఎస్. ఎన్. మూర్తి
స్టిల్స్ :	మూర్తి
ఎడిటింగ్ :	భక్తవత్సలం
రికార్డింగ్ :	శివరాం (వాహిని) కోటేశ్వరరావు (భరణి)
రీ రికార్డింగ్ :	స్వామినాధన్ (విజయాగార్డెన్స్)
స్టుడియో :	విజయా, వాహిని, శారద
ప్రాసెసింగ్ :	విజయా లేబరేటరీ
నృత్యం :	జయరాం, వెంపటి చినసత్యం
మేకప్ :	భద్రయ్య, వీర్రాజు, నారాయణ
పబ్లిసిటీ చిత్రీకరణ :	కె. నాగేశ్వరరావు బి. ఏ.
జనరల్ మేనేజరు :	ఆర్. బాలాజీసింగ్
సంగీత దర్శకత్వం :	ఘంటసాల
సహాయకులు :	సంగీతరావు, రాఘవులు
దర్శకత్వం :	ఆమంచర్ల శేషగిరిరావు.